# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 306 | పేజీలు: 4 | వెల: 4/- | గురువారం ● 16, మే 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి





## రిగ్గింగ్ చేసి గెలిచే గెలుపు కూడా ఒక గెలుపేనా..!?

హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి మాధవీ లత



### అకాల వర్షాలతో
# తడిసిన ధాన్యం

## ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం

- పలుచోట్ల వర్షానికి కొట్టుకుపోయి నష్టం
- ప్రకటనలే తప్ప కానరాని కార్యాచరణ
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ అన్నదాతలు
- పలుచోట్ల నిరసనలు..ధర్నాలు..రాస్తారోకోలు
- బీబీనగర్ వద్ద జాతీయ రహదారిపై ధర్నాతో నిలిచిపోయిన ట్రాఫిక్

**హైదరాబాద్,మే15(నమస్తే ఉదయం):** వరిధాన్యం కొనుగోళ్లలో జాప్యం సాగుతుంది. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో వరిధాన్యం తడిసి ముద్ద య్యింది. అంతేకాకుండా తేమ శాతం కూడా పెరిగింది. అకాల వర్షాలతో పలు జిల్లాల్లో ధాన్యం తడిసింది. కల్లాల్లో పోసిన ధాన్యంతో పాటు, మార్కెట్ యార్డుల్లోనూ ధాన్యం తడిసి ముద్దయ్యింది. పలుచోట్ల కొట్టుకు పోయింది. దీంతో రైతులు లబోలదిబోమంటున్నారు. ధన్యం కొంటామని అంటున్నప్పటికీ ధాన్యం కొనుగోళ్లలో అధికారులు జాప్యం చేస్తున్నారు . దీంతో అన్నదాతలు రోడ్డెక్కుతున్నారు. తేమ శాతంతో సంబంధం లేకుండా.. వరిధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అకాల వర్షాలు కురిశాయి. దీంతో ఐకెపి కేంద్రాల వద్ద వరిధాన్యం తడిసి పోయింది. ఇప్పటికీ కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. అంతేకాకుండా తేమ శాతం పెరిగిపోయింది. దీంతో తేమ శాతం ఆధారంగానే ధాన్యాన్ని కొనుగోళ్లు చేస్తున్నారు. అయితే.. తడిసిన వరిధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోనరావుపేట మండలం మల్కాపేట గ్రామంలో రైతులు ఆందోళన చేశారు. తడిసిన పరిధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. 20 రోజుల క్రితం ధాన్యాన్ని తీసుకొచ్చినా కొనుగోలు చేయడం లేదని రైతులు రోడ్కెక్కారు. అదే విధంగా పరిధాన్యం తడిసిపోవడంతో తేమ శాతాన్ని పరిగణలోకి తీసుకొని కొనుగోలు చేస్తున్నారు. ఇంకా 20 శాతం వరకు కొనుగోలు చేయలేదు. ఇప్పుడు నాతవరణం కూడా మారిపోయింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో పది రోజుల్లో నైరుతి రుతుపవనాలు రానున్నాయి. ఖరీఫ్ సీజన్ కూడా ఆరంభంకానుంది. వెంటనే.. పరిధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కొన్ని చోట్ల వరిధాన్యం కొనుగోలు చేసినా.. సకాలంలో డబ్బులు రావడం లేదు. ఈ నాలుగైదు రోజుల్లో వరిధాన్యం పూర్తిగా కొనుగోలు చేయాలని కోరుతున్నారు. అధికారులు మాత్రం ఎలాంటి ఆందోళన చెందవద్దని రైతులకు సూచిస్తున్నారు. పూర్తి స్థాయిలో పరిధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇస్తున్నారు. అయితే ప్రభుత్వ తీరుపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. సకాలంలో వరిధాన్యం



## పివోకె ఎప్పటికీ భారత్‌లో భాగమే

- దానిని విలీనం చేసుకోవడమే తరవాయి
- ఎన్నికల ప్రచారంలో అమిత్ షా స్పష్టీకరణ

**కోల్‌కతా,మే15(నమస్తే ఉదయం):** పాక్ ఆక్రమిత కాశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా మరోమారు స్పష్టం చేశారు. దీనిని భారత్‌లో విలీనం చేస్తామని ప్రక టించారు. బుధవారం పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో నిరసనలను ప్రస్తావిస్తూ.. పీవోకే భారత్‌లో భాగమే. మేం దానిని తీసుకుంటామని అన్నారు.

2019లో ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత ఒకప్పుడు సమస్యాత్మకమైన కాశ్మీర్‌లో శాంతి నెలకొందని పశ్చిమ బెంగాల్ సేరంపోరే నియోజకవర్గంలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో అమిత్‌షా

మిగతా.. 2లో



### ఓటు బ్యాంక్ రాజకీయాలకు
## నేను దూరం

- అధిక సంతానం ఉన్నవారంటే పేదలే
- అది ఓ వర్గానికే అంటగట్టడం తగదు
- ప్రధాని మోడీ స్పష్టీకరణ

**వారణాసి,మే15(నమస్తే ఉదయం):** తానెప్పుడూ ఓటు బ్యాంక్ రాజకీయాలకు పాల్పడలేదని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. నేను ఓటు బ్యాంకు రాజకీయాలు చేయను. సబ్‌కా సాథ్-సబ్‌కా వికాస్‌ను బలంగా నమ్ముతాను. నా మాటలపై జరిగిన దుష్ప్రచారం చూసి షాక్ అయ్యానని అన్నారు. తన వ్యాఖ్యలు పేదవారి అవస్థల గురించి మాత్రమేనని ప్రధాని నరేంద్రమోదీ స్పష్టంచేశారు. తన వ్యాఖ్యలను ముస్లిం సమాజం గురించి అంటూ వక్రీకరించి జరిపిన దుష్ప్రచారం చేయడంపై ఆశ్చర్యపోయానన్నారు. చిన్నప్పుడు తమ ఇంట్లో ఈద్ పండగను కూడా నిర్వహించేవారమని ఓ న్యూస్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు. ఎక్కువమంది పిల్లలు గురించి మాట్లాడినప్పుడు అది ముస్లింల గురించి అని ఎవరు చెప్పారని అన్నారు. పేద కుటుంబాల్లోనూ ఇదే పరిస్థితి. కొన్ని కుటుంబాల్లో వారి సామాజిక పరిస్థితితో సంబంధం లేకుండా అధిక సంతానం ఉంది. అది ఏ వర్గం అని నేను ప్రస్తావించలేదు. చూసుకోగలిగినంతమంది సంతానాన్నే కనాలి కానీ..వారిని ప్రభుత్వం చూసుకునే పరిస్థితి ఉండకూడదని మాత్రమే చెప్పాను అంటూ మోదీ స్పష్టత ఇచ్చారు. 2002లో గోద్రా రైలు దహనకాండ అనంతరం గుజరాత్‌లో అల్లర్లు జరిగినప్పుడు మోదీ ఆ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారు. తన ప్రత్యర్థులు ముస్లిం వర్గంలో తన ప్రతిష్ఠను దెబ్బతీశారని

మిగతా.. 2లో



### ఓటమి భయంతోనే
## ఏపీలో అల్లర్లు

- కఠినంగా అణచివేయాల్సిందే
- ఏపీలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం
- ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మడం లేదు
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

**న్యూఢిల్లీ,మే15(నమస్తే ఉదయం):** ఏపీలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని.. ఎన్డీఏ కూటమి గెలుస్తుందని కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఏపీలో అల్లర్లపై కఠినంగా వ్యవహరించాలని హెచ్చరించారు. ఏపీలో కొంత నిరాశ, నిస్పృహ ఉండొచ్చని.. అందుకే అల్లర్లు జరిగి ఉండొచ్చని తెలిపారు. తెలంగాణలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని చెప్పుకొచ్చారు.

మిగతా.. 2లో



## రైతులపై ఇంత నిర్లక్ష్యమా

- తడిసిన ధాన్యం కొనడంలో ఎందుకీ ఉదాసీనత
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కెటిఆర్

**హైదరాబాద్,మే15(నమస్తే ఉదయం):** రాష్ట్ర ప్రభుత్వం రైతులను విస్మరించి రాజకీయాలపైనే దృష్టి పెట్టిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. తడిసిన ధాన్నం కొనుగోలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యిందన్నారు. రైతులు ఆందోళన చెందుతున్నా చీమకుట్టినట్లుగా లేదన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలుపై రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారన్నారు. ధాన్యం కొనుగోళ్ల పై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. తరుగు పేరుతో క్వింటాల్‌కు మూడు కేజీలు తీస్తున్నారని.. రైతులకు అన్యాయం చేయొద్దని డిమాండ్ చేశారు. రైతులకు అన్యాయం చేస్తే బీఆర్ఎస్ రోడ్డెక్కి ఆందోళన చేస్తుందని హెచ్చరించారు. గతంలో తరుగుపై కాంగ్రెస్ చేసిన ఆరోపణలు ఇప్పుడు ఎందుకు పట్టించుకోరని అన్నారు. ఇకపోతే గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో నాలుగు సార్లు బీఆర్ఎస్ మాత్రమే గెలిచిందని తెలిపారు. కేసీఆర్‌కు బలాన్ని చేకూర్చేలా గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో రాకేష్ రెడ్డిని గెలిపించాలని కోరారు. మెగా డీఎస్సీ దగా అయిందన్నారు. ఉద్యోగాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలు

మిగతా.. 2లో



## అడవుల్లో మంటలు ఎందుకు చెలరేగుతున్నాయి..?

- నివారించడంలో ప్రభుత్వం ఎందుకు విఫలమైతుంది
- ఉత్తరాఖండ్ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు ఆగ్రహం

**న్యూఢిల్లీ,మే15(నమస్తే ఉదయం):** అడవుల్లో మంటలు చెలరేగడం, వాటిని అదుపు చేసే విషయమై ఉత్తరాఖండ్ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు

మిగతా.. 2లో



### దేశ ప్రజలు
## మోదీకి వీడ్కోలు పలకాలి

- పోలింగ్ సరళి మాకే అనుకూలం
- 4న ఇండియా కూటమిదే అధికారం
- మీడియా సమావేశంలో మల్లికార్జున ఖర్గే

**లక్నో,మే15(నమస్తే ఉదయం):** నాలుగు విడతల్లో జరిగిన పోలింగ్ తమకే అనుకూలంగా ఉందని, దేశ ప్రజలు మోదీకి వీడ్కోలు పలకాలని నిర్ణయించారని, ఓటు ద్వారా తమ అభిప్రాయాలను వెల్లడించారని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే అన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తోందని ధీమా వ్యక్తం చేశారు. లక్నోలో ఆయన విలేకరులతో మాట్లా డుతూ.. జూన్ 4న

మిగతా.. 2లో

### పునర్విభజన పెండింగ్ అంశాలపై
## రేవంత్ దృష్టి

- అస్తులు, అప్పుల పంపిణీపై నివేదికకు ఆదేశం
- 18న కేబినెట్ మీటింగ్‌లో చర్చించాలని నిర్ణయం

**హైదరాబాద్, (నమస్తే ఉదయం):** తెలంగాణ రాష్ట్రం ఏర్పడి జూన్ 2వ తేదీ నాటికి పదేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో పునర్విభజనకు సంబం ధించి రెండు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న అంశాలపై ముఖ్యమంత్రి



రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. రాష్ట్ర విభజన అనంతరం ఉద్యోగుల కేటాయింపు మొదలు ఆస్తులు, అప్పుల పంపిణీకి సంబంధించిన పెండిరగ్ అంశాలపై నివేదిక తయారుచేయాలని అధికారులను ఆదేశించారు. షెడ్యూలు 9, షెడ్యూలు 10లో ఉన్న సంస్థలు, కార్పొరేషన్లకు సంబంధించిన పంపిణీ ఇంకా పూర్తి కాలేదు. పలు అంశాలపై రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. విద్యుత్ సంస్థల బకాయిలు ఇంకా తేలలేదు. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు చేసిన ప్రయత్నాలను ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. తదుపరి చేపట్టాల్సిన కార్యా చరణపై చర్చించారు. రెండు రాష్ట్రాలు సామరస్యంగా పరిష్కరించు కునేందుకు వీలున్న ఉద్యోగుల బదిలీల

మిగతా.. 2లో



## తెలంగాణలో క్రమేపీ చల్లబడుతోన్న వాతావరణం

- వచ్చే 3 రోజులు వానలు కురిసే అవకాశం
- పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్.!

**హైదరాబాద్,మే15(నమస్తే ఉదయం):** తెలంగాణలో వాతావరణం క్రమేపీ చల్లబడుతోంది. ఎండల తీవ్రత తగ్గింది. కొన్ని ప్రాంతాల్లో 47 డిగ్రీలకు పైనే ఉష్ణోగ్రతలు.. ప్రస్తుతం

మిగతా.. 2లో

### తెలంగాణలో నిర్ణయాత్మక
## శక్తిగా బీజేపీ

- ఆ పార్టీల దుష్ప్రచారం ఫలించలేదు
- జూన్ 4న షాకింగ్ ఫలితాలు రాబోతున్నాయి
- హామీల అమలుపై రేవంత్ దృష్టిసారించాలి
- ఏపీలో ఎన్డీఏ విజయం ఖాయం
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**ఢిల్లీ, (నమస్తే ఉదయం):** కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి బుధవారం మీడియాతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణ నుంచి బీజేపీకి బ్రహ్మాండ మైన ఫలితాలు రాబోతున్నాయి. ఎన్నికలు జరిగిన తీరు, మాకు అందుతున్న సమాచారం ప్రకారం కమల

మిగతా.. 2లో







### రూ.34,000 కోట్ల
## కుంభకోణం

- దేశంలోనే అతిపెద్ద బ్యాంకింగ్ కుంభకోణం
- 17 బ్యాంకుల నుంచి పెద్దమొత్తంలో మోసం
- డిహెచ్ఎఫ్ఎల్ మాజీ డైరెక్టర్ అరెస్ట్

**న్యూఢిల్లీ,మే15(నమస్తే ఉదయం):** దేశంలో బ్యాంకింగ్ మోసాలు పెరిగిపోతున్నాయి. ఇప్పటికే విజయ్ మాల్యా, నీరవ్ మోదీలు పెద్ద ఎత్తున బ్యాంకు మోసాలకు పాల్పడగా, వారిపై కేసు ఇంకా కొనసాగుతూనే ఉంది. వారు విదేశాల్లో తలదాచుకుని తప్పించుకుని ఉన్నారు. ఇప్పుడు మరో బ్యాంకు కుంభకోణం చోటు చేసుకుంది. 34000 కోట్ల బ్యాంకు మోసం కేసులో డిహెచ్ఎఫ్ఎల్ మాజీ డైరెక్టర్ ధీరజ్ వాధవాన్‌ను సిబిఐ అరెస్టు చేసింది. ధీరజ్ వాధవాన్‌ను అరెస్టు చేసిన

మిగతా.. 2లో

## పివోకె ఎప్పటికీ భారత్‌లో భాగమే

మొదటిపేజీ తరువాయి..

ప్రసంగించారు. ఇప్పుడు పాక్ ఆక్రమిత కాశ్మీర్ ఆజాదీ నినాదాలు, నిరసనలతో ప్రతి ధ్వనిస్తుంది. 2019లో ప్రభుత్వం ఆర్టికల్ 370 రద్దు చేసి కాశ్మీర్‌లో శాంతిని పునరుద్ధరించింది. అయితే ఇప్పుడు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో నిరసనలు జరుగుతున్నాయి. ఇంతకుముందు ఇక్కడ ఆజాదీ నినాదాలు వినిపించగా, ఇప్పుడు పీఓకేలో కూడా అదే నినాదాలు వినిపిస్తున్నాయి. ఇంతకు ముందు ఇక్కడ రాళ్లు రువ్వేవారని, ఇప్పుడు పీఓకేలో రాళ్లు రువ్వుతున్నారు అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా చొరబాటుదారులు కావాలా లేదా శరణార్థులకు సీఏఏ కావాలా అనేది పశ్చిమ బెంగాల్ నిర్ణయించుకోవాలి. జిహాద్‌కు ఓటు వేయాలా లేదా వికాస్‌కు ఓటు వేయాలా అనేది బెంగాల్ నిర్ణయించుకోవాలి అని అమిత్ షా పిలునిచ్చారు.

## ఓటమి భయంతోనే ఏపీలో అల్లర్లు

మొదటిపేజీ తరువాయి..

ప్రజల్లో మార్పు రావడంతో అభ్యర్థులు గొడవకు దిగారని అన్నారు. ప్రజలు ఎవరు రిజర్వేషన్ల అంశాన్ని నమ్మలేదని చెప్పారు. నామినేషన్ ఉపసంహరణ తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ మాటలు నమ్మలేదన్నారు. కాంగ్రెస్ గుర్తు మారిపోయిందేమో.. ప్రజలు ఆ పార్టీ గుర్తు గాడిద గుడ్డు అని అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో తెలంగాణలో ఆర్థిక సంక్షోభం ఏర్పడుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేని పరిస్థితిలో కాంగ్రెస్ ఉందన్నారు. ప్రతి ఇంటికి కరపత్రం వెళ్లిందని.. 100 రోజుల్లో అన్ని అమలు చేస్తామని చెప్పారు. తెలంగాణలో ఒక్క బస్సు పథకం మాత్రమే నడుస్తుందని.. దానికి ఆర్టీసీకి నిధులు చెల్లించడం లేదని అన్నారు. మహిళలకు రూ.2 వేలు, నిరుద్యోగ భృతి, రైతు కూలీలకు రూ. 12 వేలు, తులం బంగారం అన్నారని.. వాటిని కూడా ఎందుకు ఇవ్వట్లేదని ప్రశ్నించారు. 420 హామీలు రేవంత్ రెడ్డి ఇచ్చారని.. ఇచ్చిన హామీలపై రేవంత్ దృష్టి పెట్టాలని అన్నారు.ఎన్నికల ముందు రేవంత్ మోదీని విమర్శించారని చెప్పారు. ప్రజలు జూన్ 4న దానికి ఫలితం ఏ రకంగా ఉండబోతుందో చూస్తారని తెలిపారు. కాంగ్రెస్ హామీలు నెరవేర్చాలనిప్రజల పక్షాన తాము పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

నీచమైన రాజకీయాలు దిగజారాకుండా రేవంత్ రెడ్డి వ్యవహరించాలని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గడ్డుకాలంలో ఉందన్నారు. ఆర్థిక వనరుల సమీకరణ ఏవిధంగా చేయబోతున్నారో చెప్పాలన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వ పథకాలపై రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఖరి ఏంటో స్పష్టం చేయాలన్నారు. హామీలపై కాంగ్రెస్ వైఖరి ఏంటో ప్రజలకి చెప్పాలన్నారు. రాహుల్ గాంధీ అసెంబ్లీ ఎన్నికల ముందు రాష్ట్రానికి వచ్చారని.. ఆ హామీలు నెరవేర్చకుండా మళ్లీ ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికలకు కూడా కొత్త హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. తాము పక్కా కార్యాచరణతో ముందుకు వెళ్తామని అన్నారు. మల్కాజ్ గిరి, చేవెళ్ల, సికింద్రాబాద్‌లో బీజేపీకి కొంత ఓట్ల శాతం తగ్గిందని చెప్పారు. ఎన్నికలకు రెండు రోజుల ముందు కొన్ని ఓట్లను కాంగ్రెస్ కుట్రతో తీసేశారని ఆరోపించారు. రేపు ఎన్నికల కమిషన్‌కి ఓట్ల తీసేయడం పై ఫిర్యాదు చేస్తామన్నారు. ఎన్నికల ఫలితాల పై ఎలాంటి ప్రభావం ఉండదని.. ఓటర్ కార్డును ఆధార్‌కి లింక్ చేయాలని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## దేశ ప్రజలు మోదీకి వీడ్కోలు పలకాలి

మొదటిపేజీ తరువాయి..

ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పడబోతోందని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలు దేశ భవిష్యత్తును తీర్చిదిద్దేవని అన్నారు. మన భవిష్యత్ తరాలు, వాళ హక్కులు, రిజర్వేషన్లను రక్షించడానికి ప్రజలు ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణంపై ఇండియా అలయన్స్ పోరాడుతోందని చెప్పారు. రాజ్యాంగాన్ని రక్షిస్తేనే ప్రజలకు హక్కులుంటాయని అన్నారు. ఓటు ఉంటే ఎవరినైనా ప్రజాస్వామ్యంలో ఎన్నుకోగలమని అన్నారు. నియంతృత్వం, నిరంకుశత్వం ఉంటే ప్రజాస్వామ్యం ఎలా మనుగడ సాగిస్తుందని అన్నారు. బీజేపీకి బలం ఉన్న చోట తమ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా ఆపి ఏజెంట్లను మభ్యపెడుతున్నారని అన్నారు. హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి బురఖాపై కన్నేశారని గుర్తు చేశారు. దేశానికి ఎన్నో ఇచ్చామని చెబుతూ బీజేపీ నేతలు రాజ్యాంగాన్ని మార్చేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. 'గాంధీజీ స్వాతంత్య్రం తెచ్చారు, నెహ్రూజీ ప్రజాస్వామ్య నిర్మాణాన్ని సృష్టించారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని అందించారు..' అని అన్నారు. బీజేపీ నేతలు రాజ్యాంగాన్ని మార్చాలని మాట్లాడుతున్నా మోదీ మౌనంగా కూర్చున్నారని, అలా మాట్లాడటం దేశద్రోహమని అనలేదని ఆరోపించారు.

## తెలంగాణలో క్రమేపీ చల్లబడుతోన్న వాతావరణం

మొదటిపేజీ తరువాయి..

40 డిగ్రీలకు పడిపోయింది. దీనికి కారణంగా ఉపరితల ఆవర్తనమే అని అంటున్నారు వాతావరణ శాఖ అధికారులు. మహారాష్ట్రలోని పశ్చిమ విదర్భ పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తులో అవర్తనం ఏర్పడిందని.. దీని కారణంగా రాష్ట్రంలో వచ్చే మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయన్నారు. బుధవారం.. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఉరుములు, మెరుపులు, 30-40 కిమీ వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు తెలంగాణలోని ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది.గురువారం.. ఉరుములు, మెరుపులు, 40-50 కిమీ వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు తెలంగాణలోని ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. అలాగే ఉరుములు, మెరుపులు, 30-40 కిమీ వేగంతో కూడిన వర్షాలు తెలంగాణ రాష్ట్రంలోని సిద్ధిపేట, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. శుక్రవారం.. ఉరుములు, మెరుపులు, 30-40 కిమీ వేగంతో కూడిన వర్షాలు తెలంగాణ రాష్ట్రంలోని జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, నాగర్ కర్నూలు జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. గత ఏడాదిలా కాకుండా ఈసారి తెలుగు రాష్ట్రాలను గట్టిగా పలకరిస్తామంటున్నాయి నైరుతి రుతుపవనాలు. విపరీతమైన ఎండలు ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. ఈ ఏడాది ముందుగానే నైరుతి పలకరిస్తుందంటోంది. ఈనెల 19వ తేదీన అండమాన్ నికోబార్ దీవులను నైరుతి రుతు పవనాలు తాకుతాయి. ఆ తర్వాత కేరళను పలకరించి.. తెలుగు రాష్ట్రాలకు చల్లని మబ్బులు దూసుకొస్తాయి. గత ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయిన నేపథ్యంలో.. ఈసారి రుతు పవనాలు ఎలా ఉండబోతున్నాయి? వర్షాలు సమృద్ధిగా పడతాయా? సాధారణంగా ఉంటాయా? ఇప్పుడు ఇదే ఉత్కంఠ రేపుతోంది. అయితే ఈసారి వర్షపాతం బాగా నమోదవుతుందని చెబుతోంది వాతావరణ శాఖ. ఎల్ నినో ప్రభావం తగ్గి, లా నినో ప్రభావం రాబోతుండడం దీనికి దోహదం చేస్తుందంటున్నారు అధికారులు. ప్రస్తుత పరిస్థితులను బట్టి ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురుస్తాయని ఇప్పటికే ఐఎండీ అంచనా వేసింది. రుతుపవనాలు ఆశాజనకంగా ఉంటాయని, వర్షాలు కురిసేందుకు అనువైన వాతావరణం ఉంటుందంటున్నారు నిపుణులు. ఈ ఏడాది ప్రస్తుతానికి అనుకూల పరిస్థితులే ఉన్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. తొలకరి పలకరింపు కోసం తెలుగు రాష్ట్రాలు తెగ ఎదురు చూస్తున్నాయి.

## ఓటు బ్యాంక్ రాజకీయాలకు నేను దూరం

మొదటిపేజీ తరువాయి..

దుయ్యబట్టారు. 'చిన్నప్పుడు మా ఇంటి చుట్టుపక్కల ఎన్నో ముస్లిం కుటుంబాలు ఉండేవి. మా ఇంట్లో కూడా మిగతా పండగలతో పాటు ఈద్ కూడా నిర్వహించేవాళ్లం. ఈద్ రోజున మా ఇంట్లో వంట చేసుకునేవాళ్లం కాదు. ఆ వర్గానికి చెందిన కుటుంబాలే మాకు ఆహారం తెచ్చిఇచ్చేవి. అలాగే మొహర్రంలోనూ భాగమయ్యేవాళ్లం. అలాంటి ప్రపంచంలో నేను పెరిగాను. నా స్నేహితుల్లో చాలా మంది ముస్లింలు ఉన్నారని వెల్లడించారు. అలాగే ఈ ఎన్నికల్లో ఆ వర్గం నుంచి ఓట్లు పడతాయా? అని ప్రశ్నించగా..ఈ దేశ ప్రజలు తనకు ఓటు వేస్తారని సమాధానం ఇచ్చారు. హిందూ-ముస్లిం అంటూ తేడా చూపడం ప్రారంభించిన రోజు.. ప్రజాజీవితంలో ఉండే అర్హత తనకు ఉండదన్నారు. అలాంటి తేడా ఎన్నటికీ చూపనంటూ ప్రతిజ్ఞ చేశారు. కొద్దిరోజుల క్రితం రాజస్థాన్‌లో ఎన్నికల ర్యాలీలో మాట్లాడుతూ మోదీ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. 'ప్రజల వద్ద ఉన్న బంగారంతో సహా సంపద మొత్తం సర్వే చేసి అందరికీ సమానంగా 'పునఃపంపిణీ' చేస్తామని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో చెప్పింది. ఆ మేరకు దేశ సంపదనంతా చొరబాటుదారులకు, ఎక్కువమంది పిల్లలు ఉన్నవారికి పంచుతారు. మీ ఆస్తులను జప్తు చేసే అధికారం ప్రభుత్వాలకు ఉందా? అర్బన్ నక్సలిజం మనస్తత్వం ఉన్న ఆ పార్టీ నాయకులు మహిళల మంగళ సూత్రాలను కూడా వదలరు. మీ కష్టార్జితం చొరబాటుదారుల పాలవడం మీకు సమ్మతమేనా?' అని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీశాయి. దీనిపై ప్రధాని మోదీ విమర్శలకు వివరణ ఇచ్చారు.

### పునర్విభజన పెండింగ్

# అంశాలపై రేవంత్ దృష్టి

(మొదటిపేజీ తరువాయి..)

వంటి అంశాలు పూర్తి చేయాలని ఆదేశించారు. రెండు రాష్ట్రాల మధ్య సయోధ్య కుదిరిన వాటిని పరిష్కరించుకోవాలని, పీటముడి పడిన అంశాలపై తెలంగాణ ప్రయోజనాలను కాపాడేలా తదుపరి కార్యాచరణ చేపట్టాలని సూచించారు.

**హైదరాబాద్ ఇక తెలంగాణకే...**

పదేళ్లు పూర్తి కానుండటంతో పునర్విభజన చట్టం ప్రకారం ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్ కేవలం తెలంగాణ రాష్ట్ర రాజధానిగా మారనుంది. ఈ పదేళ్ల కాలానికి ఏపీకి కేటాయించిన లేక్ వ్యూ గెస్ట్‌హౌస్ వంటి భవనాలను జూన్ 2 తర్వాత రాష్ట్ర అధీనంలోకి తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పునర్విభజన చట్ట ప్రకారం పెండిర గ్‌లో ఉన్న అంశాలు, ఇప్పటివరకు రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయంతో పంపిణీ చేసుకున్న వివరాలపై సమగ్రమైన నివేదికను తయారు చేయాలని ఆదేశించారు.

**18న కేబినెట్ సమావేశం**

ఈ నెల 18వ తేదీన శనివారం రాష్ట్ర కేబినేట్ సమావేశం ఏర్పాటు చేయాలని ముఖ్య మంత్రి నిర్ణయించారు. అందులో రాష్ట్ర పునర్విభజన చట్టంలో పెండిరగ్‌లో ఉన్న అంశాలు, ఏపీతో పీటముడిగా ఉన్న అంశాలను చర్చించనున్నారు. వీటితో పాటు రైతుల రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లు, వచ్చే ఖరీఫ్ పంటల ప్రణాళికపై చర్చించనున్నారు. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ముగియటంతో ముఖ్యమంత్రి ప్రజా పాలనపై దృష్టి కేంద్రీకరించారు.

బుధవారం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తో కలిసి వివిధ శాఖల అధికారులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు సాఫీగా జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

# తెలంగాణలో నిర్ణయాత్మక శక్తిగా బీజేపీ

(మొదటిపేజీ తరువాయి..)

వికాసం ఖాయం. అందరినీ ఆశ్చర్యపరిచేలా ఫలితాలు ఉండబోతున్నాయి. ముఖ్యమంత్రి మాపై దుష్ప్రచారం చేసినా ప్రజలు మమ్మల్ని విశ్వసించారు. తెలంగాణలో ఎవరు గెలిచినా.. మేమే కీలకం అన్నట్లు మజ్లిస్ వ్యవహరించిన తీరు కూడా బీజేపీకి అనుకూలంగా మారింది. రాజ్యాంగం మార్చ డం, రిజర్వేషన్లు అనే అంశాలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ దుష్ప్రచారం చూసి ప్రజలు నవ్వు కున్నారు. రిజర్వేషన్లు ఎత్తేసే శక్తి ఎవరికీ లేదు. అంబేద్కర్ అనుకున్నా ఇవాళ దేశం నుంచి రిజర్వేషన్లు తొలగించలేరని మోదీ చెప్పారు. రిజర్వేషన్ల పరిధిలోకి వచ్చే వర్గాలన్నీ ముందుండి బీజేపీకి ఓటేశాయనేది అర్థమైంది. తెలంగాణలో నిశ్శబ్ద విప్లవం కనబడు తోంది. డబుల్ డిజిట్ సీట్లు సాధిస్తాం. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు బీజేపీ సరైన ప్రత్యామ్నా యంగా అవతరించ బోతోంది. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణలో అస్తిత్వం కోల్పోనుంది. తెలంగాణలో ఆర్థిక సంక్షోభం ఏర్పడే పరిస్థితులున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తెలంగాణ భవిష్యత్తు గురించి ఆలోచించకుండా అనవసర ఖర్చులు చాలా చేశాయి. మోదీపై రేవంత్ వ్యక్తిగతంగా విమర్శించారు. దీనికి ప్రజలు సరైన సమాధానం ఇచ్చారు. జూన్ 4న మీరంతా చూడబోతున్నారు. నీచ రాజకీయాలపై కాకుండా హామీల అమలు పై, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై దృష్టిపెట్టాలని రేవంత్‌కు హితవుపలికారు.

**హామీల అమలుపై సమీక్ష జరగాలి**

హామీల అమలుకు ఆర్థిక వనరుల సమీకరణ ఎలా చేయబోతున్నారో రేవంత్ చెప్పాలి. దళితబంధు, కల్యాణలక్ష్మి, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ పథకాల అమలు ఎలా జరిగింది. వాటిపై సమీక్ష జరగాలని డిమాండ్ చేస్తున్నాను. ఈ వివరాలను ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా హైదరాబాద్‌కు వచ్చిన రాహుల్‌గాంధీ కొత్త హామీలిచ్చిపోయాడు. పాత హామీల గురించి మాట్లాడటం మరిచి పోయాడు. రానున్న రోజుల్లో ప్రత్యేక కార్యాచరణతో ముందు కెళ్తాం. పట్టణ ప్రాంతాలలో ఓటింగ్ శాతం తగ్గింది. ఓటరు లిస్టును సంస్కరించాల్సిన అవసరం ఉంది. జిల్లా ఎన్నికల అధికారులకు పదే పదే విజ్ఞప్తి చేశాం.

**ఓటరు కార్డుతో ఆధార్ అనుసంధానం జరగాలి**

రెండ్రోజుల ముందు 20 వేలు, 30 వేల ఓట్లను తొలగించారు. వారం రోజుల ముందు ఓటరు స్లిప్పులు పంపిన ఓటర్లను కూడా తీసేశారు. కావాలనే బీజేపీ ఓట్లను తొలగించారు. దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయబోతున్నాం. ఎన్నికల ఓటరు కార్డును, ఆధార్‌తో సీడిరగ్ చేయాల్సిన అవసరం ఉంది. దీనిపై అత్యున్నతస్థాయి సమీక్ష జరగాలి. రిగ్గింగ్ జరిగిన బూతుల వివరాలు సేకరిస్తున్నాం. అక్కడ రీ పోలింగ్‌కు డిమాండ్ చేస్తున్నాం. పార్లమెంటు ఎన్నికల్లో ఓటు మీకే అనే విషయం అసెంబ్లీ ఎన్నికల ప్రచా రంలో ప్రజలు మాకు చెప్పారు. ఆ మాటకు కట్టుబడి బీజేపీకి ఓటేసినట్లు మా సమీక్షలో వెల్లడైంది. ఏపీలో ఎన్డీఏ కూటమి విజయం సాధించడం ఖాయం. దేశవ్యాప్తంగా 400 సీట్లు గెలవడం తథ్యమని స్పష్టం చేశారు.

### రూ.34,000 కోట్ల

# కుంభకోణం

మొదటిపేజీ తరువాయి..

తర్వాత, ఢిల్లీలోని ప్రత్యేక కోర్టులో హాజరుపరచగా, కోర్టు అతన్ని జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. వాధావన్ 17 రుణ బ్యాంకులతో ఈ మోసానికి పాల్పడ్డాడు. ఇది ఇప్పటివరకు దేశంలో అతిపెద్ద బ్యాంకింగ్ మోసం. 34,000 కోట్ల విలువైన 17 బ్యాంకుల కన్సార్టియం




మోసానికి సంబంధించి సీబీఐ ఇప్పటికే కేసు నమోదు చేసింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ బ్యాంకుల కన్సార్టియంకు నాయకత్వం వహిస్తోంది. 2022లోనే బ్యాంకు మోసం కేసులో ధీరజ్ వాధావన్ పేరును సీబీఐ ఛార్జ్ షీట్‌లో చేర్చారు. అదే సమయంలో ఇది దేశ బ్యాంకింగ్ చరిత్రలో అతిపెద్ద మోసంగా పరిగణించబడుతుంది. ఇంతకు ముందు కూడా యెస్ బ్యాంక్ కుంభకోణం కేసులో ధీరజ్ వాధవాన్‌ను సీబీఐ అరెస్టు చేసింది. ప్రస్తుతం అతను ఈ కేసులో బెయిల్‌పై ఉన్నాడు.డిహెచ్‌ఎఫ్ఎల్ సిఎండి కపిల్ వాధావన్, డైరెక్టర్ ధీరజ్ వాధావన్ సహా మొత్తం 74 మంది, 57 కంపెనీలపై సిబిఐ న్యూఢిల్లీలోని ప్రత్యేక కోర్టు ఆఫ్ రౌస్ అవెన్యూ కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేసింది. 17 బ్యాంకుల్లో మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. సీఈవో హర్షిల్ మెహతా పేరును కూడా చార్జ్ షీట్‌లో చేర్చారు.యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫిర్యాదుపై దాఖలు చేసిన %యూా×=, ఇఁఖీూ% కపిల్ వాధావన్, డైరెక్టర్‌గా ఉన్న ధీరజ్ వాధావన్, ఇతర నిందితులతో కలిసి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నేతృత్వంలోని 17 బ్యాంకులతో మోసం చేయడానికి కుట్ర పన్నారని పేర్కొంది. నేరపూరిత కుట్ర చేసి రూ.42,871.42 కోట్ల రుణం ఇవ్వాలని ఈ బ్యాంకులను కోరింది. భారీ మొత్తంలో రుణం తీసుకుని దుర్వినియోగం చేశారు. సీబీఐ ప్రకారం.. జూలై 31, 2020 నాటికి 17 బ్యాంకుల కన్సార్టియం బకాయిల కారణంగా రూ. 34615 కోట్ల నష్టం వాటిల్లిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# అడవుల్లో మంటలు ఎందుకు చెలరేగుతున్నాయి..?

మొదటిపేజీ తరువాయి..

ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇందుకు సంబంధించి బుధవారం సుప్రీంకోర్టు ఉత్తరాఖండ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమన్లు జారీ చేసింది. శుక్రవారం రోజు తమ ముందు హాజరై అడవుల్లో మంటలు ఎందుకు చెలరేగుతున్నాయి..? వాటిని రాష్ట్ర ప్రభుత్వం నివారించడంలో ప్రభుత్వం ఎందుకు విఫలమైతుందోననే అంశాలపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

భారీ స్థాయిలో చెలరేగుతున్న మంటలను అరికట్టేందుకు అవసరమైన నిధులు సమకూర్చకపోవడంపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. అదేవిధంగా అడవుల్లో మంటలు మండుతున్న వేళ ఎన్నికల విధుల్లో అటవీ అగ్నిమాపక సిబ్బందిని ఎందుకు నియమించారని ఉత్తరాఖండ్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అయితే, ఉత్తరాఖండ్ అడవులల్లో భారీగా కార్చిచ్చులు చోటు చేసుకుంటున్నాయని, ఇప్పటికే చాలా వరకు అటవీ మంటల్లో దగ్ధమైందని, వాటిని అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని పేర్కొంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది.

వాటిని అరికట్టేలా చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలివ్వాలని పిటిషనర్లు కోరారు. దీనిపై గురువారం విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఉత్తరాఖండ్ ప్రభుత్వంపై సీరియస్ అయ్యింది. ఉత్తరాఖండ్ అటవీ ప్రాంతంలో భారీ స్థాయిలో మంటలు చెలరేగుతున్నా అవసరమైన చర్యలు ఎందుకు తీసుకోలేదు..? ఆ మంటలను ఆర్పివేసేందుకు అవసరమైన అగ్నిమాపక సిబ్బందిని ఎందుకు నియమించలేదని.. ఎందుకు అలసత్వం వహిస్తున్నారంటూ ? ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది.అయితే, అగ్నిమాపక సిబ్బంది నియామక ప్రక్రియ కొనసాగుతుందని, మంటల(కార్చిచ్చులు)ను ఆర్పివేసేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు అందడంలేదని ఆ రాష్ట్ర తరఫున న్యాయవాది న్యాయస్థానానికి విన్నవించారు. వాదనలు విన్న సుప్రీంకోర్టు ధర్మాసనం ఆ రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. మే 17న ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ధర్మాసనం ముందు హాజరై, ఇందుకు సంబంధించి పూర్తి వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

# అకాల వర్షాలతో తడిసిన ధాన్యం

మొదటిపేజీ తరువాయి..

కొనుగోలు చేయాలని కోరుతున్నారు. అకాల వర్షాల కారణంగా వరిధాన్యం తడిసిపోయిందని రైతులు చెబుతున్నారు. తేమ శాతం పేరుతో సరిగా కొనుగోలు చేయడం లేదని అంటున్నారు. వెంటనే పరిధాన్యాన్ని కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అనేకచోట్ల ఇదే పరిస్థితి ఉండడంతో ధాన్యం కొనుగోళ్ల జాప్యంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆరుగాలం కష్టపడి, అప్పులు చేసి పంటలు పండిస్తే ప్రభుత్వం కోనుగోలు చేయక పోవడంతో ప్రభుత్వంపై మండి పడుతున్నారు. కండ్ల ముందే పంటలు పాడవుతున్నా పట్టించుకోకపోవడంతో విసుగు చెందిన రైతులు ఆందోళన బాటపడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలను దిగ్బంధిస్తూ, రోడ్లపై బైఠాయిస్తూ తమ నిరసనను తెలుపుతున్నారు. తాజాగా యాదాద్రి భువనగిరి జిల్లాలో అన్నదాతలు ఆందోళన బాటపట్టారు.

నెల గడుస్తున్నా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తమ ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో ఆగ్రహించిన రైతులు, బుధవారం బీబీనగర్ మండలం గూడూరు గ్రామంలో హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిని దిగ్బంధం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. గంట పాటు రాస్తారోకో నిర్వహించారు. దీంతో జాతీయ రహదారిపై ఎక్కడికక్కడ వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి.

స్థానిక తహసీల్దార్ శ్రీధర్ ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. కాగా, అంతకుముందు భువనగిరి మండలం పచ్చళ్లపాడు తండా గ్రామానికి చెందిన గిరిజన రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి వడ్లు కొనకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

### రైతులపై ఇంత

# నిర్లక్ష్యమా

మొదటిపేజీ తరువాయి..

తానే ఇచ్చినా అని రేవంత్ రెడ్డి అబద్దాలు చెబుతున్నారన్నారు. ప్రశ్నించే గొంతు.. పార్టీ ఉంటేనే ప్రభుత్వం ఉద్యోగాలను భర్తీ చేస్తుందన్నారు. ఒక బ్లాక్ మెయిలర్‌ను కాంగ్రెస్ పార్టీ పోటీలో పెట్టిందని వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే నల్గొండలో నయీమ్ లాంటి వ్యక్తిని తయారు చేసినవాళ్ళం అవుతామన్నారు. ఉద్యోగులను ముఖ్యమంత్రి నిందించటం సరికాదన్నారు. ముఖ్యమంత్రి దిక్కుమాలిన మాటలు మాట్లాడొద్దంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నారాయణ ఖేడ్‌లో టీచర్లపై లాఠీ ఛార్జ్ చేస్తారా అంటూ మండిపడ్డారు. మూడు లక్షల ఎనభై కోట్ల అప్పు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం అప్పు చేసిందని రిజర్వ్ బ్యాంకు నివేదిక రిలీజ్ చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడు లక్షల కోట్లు అంటూ ఫేక్ ప్రచారం చేస్తోందన్నారు. దీనికి సీఎం, డిప్యూటీ సీఎం రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్ ఊసరవెల్లిలా మాట్లాడుతున్నారన్నారు. హైదారాబాద్ విషయంలో బీజేపీ ఏం చేయబోతుందో జూన్ 4 తర్వాత తెలుస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు.

### కరెంట్ విషయంలో

# ప్రభుత్వానిదే వైఫల్యం

**ఉద్యోగులపై నెపం నెట్టడం దారుణం**

**సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు**

సిద్దిపేట,మే15(నమస్తే ఉదయం):

కరెంట్ కోతల విషయంలో సీఎం రేవంత్ తన ప్రభుత్వ వైఫల్యాలను అంగీకరించకుండా ప్రతి పక్షాలు, విద్యుత్ ఉద్యోగుల మీద అభాండాలు మోపడాన్ని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. విద్యుత్ రంగ వైఫల్యాలకు నేనే బాధ్యుడిని అన్నట్టుగా మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన వైఖరి ఆడరాక పాత గజ్జెలు అనే సామెతను గుర్తు చేస్తుందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం, 24 గంటల పాటు నిరంతరంగా విద్యుత్ సరఫరా చేసేందుకు.. విద్యుత్ ఉద్యోగుల సహకారంతో పటిష్ఠమైన వ్యవస్థను నిర్మించిందని.. రెప్పపాటు కాలం కూడా కరెంట్ కోతలు లేని ఏకైక రాష్ట్రంగా తెలంగాణను నిలిపిందని గుర్తు చేశారు. కేవలం ఐదు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఆ వ్యవస్థను కుప్ప కూల్చిందని.. గృహ, వ్యవసాయ, పారిశ్రామిక అవసరాలకు సరిపోయే విద్యుత్ సరఫరా చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. తమ చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకు, ప్రతిపక్షాలు, విద్యుత్ ఉద్యోగులపై రేవంత్ రెడ్డి నిరాధార ఆరోపణ చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో, తెలంగాణ పునర్నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన విద్యుత్ ఉద్యోగులను చీటికి మాటికి నిందించడం, చర్యలు తీసుకోవడం వారి ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీయడమేనన్నారు.

విద్యుత్ ఉద్యోగులపై నెపం నెట్టడమే తప్ప కరెంటు కోతలను ఎలా సరిదిద్దాలనే చిత్తశుద్ధి సీఎంకు లేకపోవడం దురదృష్ట కరమన్నారు. సీఎం ఇలాంటి చిల్లరమల్లర చేష్టలు మాని కేసీఆర్ హయాంలో రెప్ప పాటు కూడా పోని విధంగా 24 గంటల విద్యుత్‌ని ఇచ్చినట్టుగా అన్ని రంగాలకు సరఫరా చేస్తే మంచిదన్నారు. తన లాగే అందరూ కుట్రలు కుతంత్రాలకు పాల్పడుతారని సీఎం భ్రమల్లో ఉన్నట్టున్నారని.. వాటిని వీడి పాలన పై దృష్టి పెడితే మంచిదంటూ చురకలంటించారు.

### రిగ్గింగ్ చేసి గెలిచే గెలుపు కూడా

# ఒక గెలుపేనా..!?

**హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి మాధవీ లత**

హైదరాబాద్,మే15(నమస్తే ఉదయం):

హైదరబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో ఎంఐఎం నేతలు అక్రమ రిగ్గింగ్ కు పాల్పడ్డారని హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి మాధవీ లత ఆరోపించారు. ఇవాళ ఆమె మీడియాతో మాట్లాడుతూ.. రిగ్గింగ్ చేసి గెలిచే గెలుపు కూడా ఒక గెలుపేనా అని విమర్శించారు. 16 సంవత్సరాల ముస్లిం బాలిక రెండు సార్లు ఓటు వేయడానికి వచ్చి దొరికిందని, ఆ బాలిక పై కేసు నమోదు చేయకుండా తల్లితండ్రులకు అప్పగించి పంపించారని ఆమె ఆరోపించారు. రిగ్గింగ్ ఆపడానికి వెళ్లిన నాపై వేల మంది రౌడి మూకలు దాడికి యత్నించారని, రిగ్గింగ్ జరుగుతున్నా అక్కడ ఉన్న పోలీసులు స్పందించలేదని మాధవీ లత మండిపడ్డారు. ఇది భారత దేశమేనా.. ఇక్కడ 144 సేక్షన్ ఉండదా..? అని ఆమె ప్రశ్నించారు.

ఈ రిగ్గింగ్‌పై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశామని, అవసరమైతే రీ పోలింగ్ పెట్టడానికి ఎంత దూరమైనా వెళ్ళడానికి సిద్ధమని ఆమె వెల్లడించారు. రేపు ముంబైలో ప్రచారానికి వెళ్ళాలని పార్టీ ఆదేశించిందని అక్కడికి వెళ్తున్నట్లు తెలిపారు. ఇదిలాఉంటే.. పోలింగ్ రోజు హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని వివిధ పోలింగ్ బూత్‌ల్లో పర్యటించిన మాధవీలత.. రిగ్గింగ్ జరుగుతుందనే అనుమానంతో ఓ ముస్లిం మహిళను బురా? తీసి ఆమె ముఖాన్ని ఓటర్ స్లిప్‌లో ఉన్న ఫొటోతో సరిపోల్చి చూశారు. ఈ ఘటన వివాదస్పదంగా మారడంతో కన్నెర్రజేసిన ఈసీ.. ఆమెపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని ఆదేశించింది. ఈసీ ఆదేశాలకు ఆమెపై మలక్ పేట్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగానే.. హైదరాబాద్‌లో రిగ్గింగ్ జరిగిందని.. రీ పోలింగ్ నిర్వహించాలని మాధవీలత డిమాండ్ చేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆమె డిమాండ్‌పై ఈసీ ఏ విధంగా రియాక్ట్ అవుతుందనేది స్టేట్ పాలిటిక్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

# భారత్‌కి ప్రధాని మోడీ నాయకత్వం అవసరం

## వక్ఫ్ బోర్డు చైర్మన్ సంచలన వ్యాఖ్యలు

**ఉత్తరాఖండ్,మే15(నమస్తే ఉదయం):** ప్రధాని నరేంద్రమోడీని ఉద్దేశించి ఉత్తరాఖండ్ వక్ఫ్ బోర్డు చీఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రపంచం యుద్ధం అంచున ఉన్న ఈ తరుణంలో భారత్‌కి ప్రధాని మోడీ బలమైన నాయకత్వం అవసరమని బుధవారం అన్నారు. "ప్రపంచమంతా యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. వివిధ దేశాల్లో గందరగోళ పరిస్థితులు ఉన్నాయి. ఇలాంటి సమయంలో భారత్‌కి మోడీ వంటి బలమైన నాయకత్వం అవసరం. ఆయన మూడోసారి అధికారంలోకి రావాలి. ఈ తరుణంలో నాయకత్వం బలహీనమైన వారి చేతిలోకి వెళ్తే దేశం నష్టపోతుంది" అని వక్ఫ్ బోర్డు చైర్మన్ షాదాబ్ షామ్స్




అన్నారు. సోమవారం హరిద్వార్‌లోని పిరాన్ కలియార్‌లో సాబీర్ సాహెబ్ దర్గా వద్ద ముస్లిం కమ్యూనిటీ సభ్యులతో కలిసి ప్రధాని మోడీ కోసం షాదబ్ చాదర్ సమర్పించారు. భారత అభివృద్ధి చెందేందుకు వరసగా మూడోసారి ఆయన అధికారంలోకి రావాలని ప్రార్థించినట్లు వెల్లడించారు. ప్రధాని మోదీ హయాంలో అభివృద్ధి ప్రయోజనాలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరాయని ఆయన అన్నారు. సంక్షేమ కార్యక్రమాలు చివరి వ్యక్తికి కూడా చేరుతున్నాయని, మరుగుదొడ్డి, సొంత ఇళ్ల వంటి కలలు నెరవేరుతున్నాయని చెప్పారు. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని షాదాబ్ అన్నారు. విపక్షాలు ఆరోపిస్తున్నట్లుగా ప్రధాని మోదీ నాయకత్వంలో ముస్లింలకు గానీ, భారత రాజ్యాంగానికి గానీ ప్రమాదం లేదని ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ ఆయన చెప్పారు. రాజ్యాంగానికి కానీ, ముస్లింలకు కానీ ఎలాంటి ముప్పు లేదని, కొందరు రాజకీయ నాయకుల దుకాణం మాత్రమే ప్రమాదంలో పడిందని, దేశ ప్రజల్ని, ముస్లింలను తప్పుదోవ పట్టించేందుకు కొందరు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు.

# స్పెక్ట్రమ్ ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన త్రిపుర గవర్నర్

**హైదరాబాద్,మే15(నమస్తే ఉదయం):** మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో 'స్పెక్ట్రమ్ ఆర్ట్ ఎగ్జిబిషన్'ను త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఎన్ ఇంద్రసేనారెడ్డి బుధవారం ప్రారంభించారు. మే 20 వరకు జరిగే ఈ ప్రదర్శనలో డ్రాయింగ్‌లు, ఆయిల్ పెయింటింగ్‌లు, ఎచింగ్‌లు, సిరామిక్ శిల్పాలు మరియు ఫైబర్ శిల్పాలతో సహా విభిన్న కళాత్మక వ్యక్తీకరణలు ఉన్నాయి. ఈ విభిన్న కళాకృతులను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, గోవాకు చెందిన ఏడుగురు నైపుణ్యం కలిగిన కళాకారులు PY రాజు, గోపాల్, క్రాంతి చారి, ప్రియదర్శన్,





రాజేష్ చోడంకర్, శ్రీ హర్ష, వాసుదేయో శెట్యే రూపొందించారు. ప్రదర్శనలో ఉన్న కళాఖండాల లోతు అందాన్నిఇంద్రసేనారెడ్డి ప్రశంసించారు. కళాకారుల నైపుణ్యం, సృజనాత్మకతకు తన ప్రశంసలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ్, సంగీత దర్శకుడు మహిత్ నారాయణ్ తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ కళాకారుడు పి.వై.రాజు మాట్లాడుతూ చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో బుధవారం ప్రారంభమైన SPECTRUM ఆర్ట్ ఎగ్జిబిషన్ ఈ నెల 20 వరకు కొనసాగుతుందని.. ఎగ్జిబిషన్ కు వచ్చిన వారిని ఆయన ఆహ్వానించారు. ఇది కూడా చదవండి - నల్గొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నికకు బీజేపీ సిద్ధమైంది. తాము ఏర్పాటు చేసిన ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించినందుకు ఏడుగురు కళాకారులు త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనారెడ్డి, చిత్ర దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ్, సంగీత దర్శకుడు మహిత్ నారాయణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. తాము ఏర్పాటు చేసిన ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించినందుకు ఏడుగురు కళాకారులు త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనారెడ్డి, చిత్ర దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ్, సంగీత దర్శకుడు మహిత్ నారాయణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఖమ్మంలో రోడ్డు ప్రమాదంలో వృద్ధ దంపతులు మృతి

**ఖమ్మం,మే15(నమస్తే ఉదయం):** ఖమ్మం జిల్లా బోనకల్ మండలం ముష్టికుంట వద్ద ప్రధాన రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధ దంపతులు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఖమ్మం నగరంలోని మామిళ్లగూడెం ప్రాంతానికి చెందిన మృతులు సత్యనారాయణ, రుక్మిణి దంపతులు 75 ఏళ్లు పైబడిన వారు కారులో ప్రయాణిస్తుండగా ఘటన జరిగింది. కారును నడుపుతున్న వ్యక్తి రోడ్డుపై రాంగ్ రూట్ లో వెళుతుండగా వాహనంపై నియంత్రణ కోల్పోయి రోడ్డుపక్కన ఉన్న చెట్టును ఢీకొట్టడంతో ప్రమాదం తాకిడికి వాహనం దగ్ధమైంది. స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని కారులో ఉన్న వారిని రక్షించారు. వృద్ధ దంపతులు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. గాయపడి అపస్మారక స్థితిలో ఉన్న ఇద్దరు యువకులను చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై బోనకల్ ఎస్ఐ మధుసూధన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉంటే.. కరీంనగర్ జిల్లాలోనూ ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది.

శంకరపట్నం మండలం తాడికల్ లో డీజిల్ ట్యాంకర్ బీభత్సం సృష్టించింది. తాడికల్ బస్టాండ్ వద్ద నిలబడి ఉన్న ఆరుగురుని ట్యాంకర్ అదుపు తప్పి ఢీ కొట్టింది.. దీంతో.. పూదరి శ్రీనివాస్ అనే వ్యక్తిపై ట్యాంకర్ బోల్తాపడగా ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. యాక్సిడెంట్ పై స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. టాంకర్ డ్రైవర్ క్లీనర్ లను స్థానికులు గ్రామపంచాయితీలో బంధించారు. ఆస్పత్రికి తీసుకెళ్లిన వారి మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తుంది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# యూకే పార్లమెంట్ బరిలో తెలుగుబిడ్డ

- లేబర్ పార్టీ అభ్యర్థిగా ఉదయ్ నాగరాజు
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా శనిగరం స్వగ్రామం

**హైదరాబాద్, (నమస్తే ఉదయం):** బ్రిటన్ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీకి తెలుగుబిడ్డ ఎంపిక య్యారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోహెడ మండలం శనిగరకు చెందిన ఉదయ్ నాగరాజు లేబర్ పార్టీ నుంచి ఎన్ని కల బరిలో నిలుస్తున్నారు. నార్త్ బెడ్ ఫోర్డ్ షైర్ లేబర్ పార్టీ పార్లమెంటరీ అభ్యర్థిగా ప్రకటించింది. నార్త్ బెడ్ ఫోర్డ్ షైర్ బౌండరీ కమిషన్ సూచనతో కొత్తగా ఏర్పడ్డ పార్లమెం ట్ నియోజకవర్గం. ప్రఖ్యాత సర్వే సంస్థ ఎలక్టోరల్ కాల్కులస్ ప్రకారం నియోజకవర్గంలో 68 శాతం లేబర్ పార్టీ గెలవ బోతుందన్న అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం బ్రిటన్‌లోనూ ఎన్నికల హడావిడి మొదల్కొంది. భారతదేశంలో ఇప్పటికే ఎన్నికలు జరుగుతుండగా ఈ సంవత్సరంలోనే బ్రిటన్, అమెరికాల్లోనూ ఎన్నికలు జరుగనున్నాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయిల్ - పాలస్తీనా సంఘర్షణ, ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ప్రమా దం పొంచిఉన్న నేపథ్యంలో జరుగుతున్న బ్రిటన్, అమెరికా ఎన్నికల మీద ప్రపంచ దేశాల దృష్టి కేంద్రీకృతమైంది.

### మధ్యతరగతి కుటుంబంలో జన్మించి..

కాగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోహెడ మండలం శనిగరం గ్రామానికి చెందిన ఒక సామాన్య మధ్య తరగతి కుటుంబంలో ఉదయ్ నాగరాజు జన్మించారు. నాగరాజు హనుమంతరావు, నిర్మలాదేవి దంపతుల కుమారుడు. చిన్నప్పటి నుంచే కష్టపడే తత్వం ఉన్న ఉదయ్ అంచలంచలుగా ఎదిగారు. బ్రిటన్‌లోని ప్రపంచ ప్రఖ్యాత యూనివర్సిటీ కాలేజీ అఫ్ లండన్‌లో పాలనా శాస్త్రంలో పీజీ చేశారు. ప్రపంచ సమాజం, బావితరా లపై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావం ముందుగానే పసిగట్టి ఏఐ పాలసీ లాబ్స్ అనే థింక్ ట్యాంక్‌ను నెలకొల్పారు. అంతర్జాతీయ వక్తగా, రచయితగా మంచి పేరు సంపాదిం చారు. క్షేత్రస్థాయి సమస్యలపైన ఉదయ్‌కు మంచి పట్టు ఉంది. స్కూల్ గవర్నర్‌గా, వాలంటీర్‌గా, విస్తృత రాజకీయ ప్రచారకుడిగా ఒక దశాబ్దకాలంగా ఇంటింటికీ ప్రచా రంతో సామాన్యుల కష్టాలపై మంచి అవగాహన సాధించారు.

### లేబర్ పార్టీ వైపే అవకాశాలు

దాదాపు అన్ని సర్వే సంస్థల ప్రకారం ఈ ఎన్నికల్లో లేబర్ పార్టీ అఖండ విజయం సాధించి ప్రభుత్వం నెలకొల్ప నుంది. తెలుగు రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్ కూడా ఈ సర్వేల ఆధారంగా కన్సర్వేటివ్ పార్టీ కనీవిని ఎరుగని రీతిలో ఓడిపోయి లేబర్ పార్టీ గెలుస్తుందని విశ్లేషిం చారు. గత కొన్ని ఎన్నికల్లోనూ




లేబర్ పార్టీ ఎంపీలు వరుసగా గెలుస్తూ వస్తున్నా రు. ఈ నెలలో జరిగిన కౌన్సిలర్, రాష్ట్ర మేయర్ ఎన్నికలోనూ లేబర్ పార్టీ ఘనవిజయం సాధించింది. దీనితో తెలుగు ముద్దుబిడ్డ ఉదయ్ నాగరాజు కూడా బ్రిటన్ పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా ఘన విజయం సాధించడం ఖాయంగా కనిపిస్తుంది.

# చిన్న ఉద్యోగులపై ప్రతాపమా రేవంత్

- వారికి తక్షణమే క్షమాపణ చెప్పాలి
- విద్యుత్ వినియోగంపై శ్వేతపత్రం ప్రకటించాలి
- బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్

**హైదరాబాద్, (నమస్తే ఉదయం):** తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ మీడియా సమావేశంలో మాట్లాడారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిని అన్న సోయి లేకుండా విద్యుత్ శాఖకు చెందిన చిన్న స్థాయి ఉద్యోగులపై లేనిపోని అభాండాలు వేస్తూ వారి ఆత్మగౌరవాన్ని కించపరుస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వంలో లేని కరెంటు కోతలు ఇప్పుడే ఎందుకు వస్తున్నాయో స్పష్టత ఇవ్వకుండా చిన్న ఉద్యోగులపై బట్ట కాల్చి మీద వేయడం తప్పు అని ధ్వజమెత్తా రు. ప్రభుత్వ పెద్ద రేవంత్‌రెడ్డి చిన్న ఉద్యోగులను చిన్నచూపు చూడటం సామాజిక నేరం. నిరాధార అహంకార వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని వారికి క్షమాపణలు చెప్పాలని కోరుతు న్నాను. ఐదు నెలల్లోనే ప్రజలు జనరేటర్స్, ఇన్వర్టర్స్ ఎందుకు కొనుక్కోవాల్సిన దుస్థితి వచ్చిందో చెప్పాలి. అనేక ఇళ్లల్లో టీవీలు, ఫ్రిజ్‌లు, వ్యవసాయ మోటార్లు ఎందుకు కాలి పోతున్నాయో



చెప్పాలి. రేవంత్ ప్రభుత్వం కరెంటు విషయంలో శ్వేతపత్రం ప్రకటించాలి. ప్రస్తుతం తెలంగాణాలో అన్నిరకాల విద్యుత్ ఉత్పత్తి ఎంత? కొనుగోళ్లు ఎంత? వినియోగం ఎంత? అన్ని వివరాలు ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు.

# నేడు రాష్ట్రవ్యాప్త నిరసనలకు కేసీఆర్ పిలుపు

- సన్న వడ్లకే రూ.500 బోనస్ అంట
- రైతులను మరోసారి మోసగించిన కాంగ్రెస్
- ఎన్నికలయ్యాక నాలుక మడతేశావా రేవంత్
- ముందు చెప్తే తుక్కుతుక్కు చేసేవాళ్లని వ్యాఖ్య

**హైదరాబాద్, (నమస్తే ఉదయం):** కాంగ్రెస్ ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక చర్యలకు నిరసనగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపు నిచ్చారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. పార్లమెంటు ఎన్నికలు ముగిసిన తెల్లారే వరి ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తానని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్య మంత్రి ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం రాష్ట్ర రైతాంగాన్ని మరోసారి మోసం చేయడం, దగా చేయడమేనని కేసీఆర్ దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వ రైతువ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండిరచారు. రాష్ట్రంలో 90 శాతం రైతులు దొడ్డు వడ్లనే పండిస్తారు. ఈ విషయం తెలిసి కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇట్లా ఎట్లా ప్రకటిస్తది? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్లు డబ్బాలో పడంగానే కాంగ్రెస్ వాళ్లకు



రైతుల అవసరం తీరింది. అందుకే నాలిక మడతేసి ఎప్పటి మాదిరిగానే నయ వంచనకు పూనుకున్నారు. ఇదే సన్న వడ్లకు మాత్రమే అనే మాట ఎన్నికలకు ముందు చెప్పి ఉంటే కాంగ్రెస్ పార్టీని రైతులు తుక్కుతుక్కు చేసే వాళ్లని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు రైతుల పక్షాన నిలబడి కొట్లాడాలని పిలుపునిచ్చారు. రైతాంగానికి భరో సా కల్పించే దిశగా తమ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

# మారుతోన్న వాతావరణ పరిస్థితుల్లో సమతుల్య వ్యవసాయం ప్రాధాన్యత అవసరం...



**- డాక్టర్ ఎం.మల్లారెడ్డి**

**రాజేంద్రనగర్,మే15(నమస్తే ఉదయం):** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సమతుల్య వ్యవసాయం - సాంకేతికత అన్న అంశంపై ఉద్యాన రైతులకు వారం రోజుల శిక్షణా బుధవారం ప్రారంభమైంది. రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని నీటి సాంకేతిక పరిజ్ఞాన కేంద్రం ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసింది.ఈ కార్యక్రమానికి పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం సహ సంచాలకులు డాక్టర్ ఎం.మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.సందర్భంగా ఆయన మాట్లా డుతూ... మారుతోన్న వాతావరణ పరిస్థితుల్లో సమతుల్య వ్యవసాయం ప్రాధాన్యతలు సంతరించుకొందని మల్లారెడ్డి తెలిపారు. అనంతరం ఉద్యానశాఖ అధికారులు ఎ.ప్రేమ్ సింగ్,శేఖర్,నీటి సాంకేతిక పరిజ్ఞాన కేంద్రం, సంచాలకులు డాక్టర్ అనిల్ కుమార్ స్వాగతోపన్యాసం చేశారు.ఈ వారం రోజుల శిక్షణ కార్యక్రమం లక్ష్యాలను వివరించారు.ఉద్యాన పంటలైన కూరగాయలు,పూల తోటల పెంపకంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం గురించి వెల్లడించారు.అలాగే ఈ పంటలలో ఉన్న ఎగుమతి అవకాశాలను కూడా రైతులకు వివరించనున్నారు. నేషనల్ కమిటీ ఆన్ ప్రెసిషన్ అగ్రికల్చర్ అండ్ హార్టికల్చర్ ఈ శిక్షణ కార్యక్రమానికి సహకారం అందించింది.వివిధ జిల్లాల ఆసక్తిగల యువ రైతులు ఈ శిక్షణలో పాల్గొంటున్నారు.



# తొలిసారిగా 14 మందికి భారతీయ పౌరసత్వం

## సీఏఏ చట్టం ప్రకారం ద్వారా ధృవీకరణ పత్రాల జారీ

**న్యూఢిల్లీ,మే15(నమస్తే ఉదయం):** పౌరసత్వ సవరణ చట్టం కింద మొదటిసారిగా 14 మందికి పౌరసత్వ ధృవీకరణ పత్రాలను జారీ చేశారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లా సర్టిఫికేట్లను అందిం చారు. సీఏఏ ప్రకారం బంగ్లాదేశ్, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ నుంచి వచ్చిన ముస్లిమేతర మైనా రిటీలు అయిన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, క్రిస్టియన్స్, పార్సీలు, జైన మతస్తులకు ఈ చట్టం ద్వారా భారత పౌరసత్వాన్ని కల్పించనున్నారు. 2019లో ఈ చట్టం ఆమోదం పొందినప్పటికీ, ఇటీవలే దీనిని అమలులోకి తీసుకువచ్చారు. 2019లో సీఏఏని పార్లమెంట్ ఆమోదించింది. అయితే నాలుగేళ్ల తర్వాత ఈ ఏడాది మార్చి 11న కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిబంధనల నోటిఫికేషన్ ఇచ్చింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ప్రాసెస్ చేసిన తర్వాత బుధ వారం 14 మంది పౌరసత్వ ధృవీకరణ పత్రా లను పొందారు. సర్టిఫికెట్లను కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లా అందజేశారు. పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులను ప్రాసెస్ చేసిన తర్వాత సర్టిఫికేట్లు అందించారు. పాకి స్తాన్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లా దేశ్‌లో మైనారిటీలుగా వివక్ష ఎదుర్కొంటున్న వారి కోసం 1955 పౌరసత్వ సవరణ చట్టాన్ని సవరించి సీఏఏని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చింది.

# గర్భంలో పిండానికి కూడా జీవించే హక్కు ఉంటుంది

## చట్టానికి విరుద్ధంగా ఉత్తర్వులను జారీ చేయలేం

## అవివాహిత పిటిషన్‌పై సుప్రీం కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,మే15(నమస్తే ఉదయం):** గర్భంలోని పిండానికి కూడా జీవించే ప్రాథమిక హక్కు ఉంటుందని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



చేసింది. 27 వారాల గర్భాన్ని తొలగించాలని 20 ఏళ్ల అవివాహిత దాఖలు చేసిన పిటిషన్‌ని స్వీకరించేందుకు సుప్రీంకోర్టు ఈ రోజు నిరాకరించింది. మే 3న తన గర్భాన్ని తొలగించేందుకు నిరాకరిస్తూ ఢిల్లీ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారిస్తున్న సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. మేము చట్టానికి విరుద్ధంగా ఏ ఉత్తర్వులను జారీ చేయలేము అని ధర్మాసనం స్పష్టం చేసింది. కడుపులో ఉన్న బిడ్డకు కూడా జీవించే హక్కు ఉంటుందని, దాని గురించి మీరు ఏం అంటారు..? అని మహిళ తరుపు న్యాయవాదిని ప్రశ్నించింది. మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ చట్టం కేవలం తల్లి గురించి మాత్రమే మాట్లాడుతుందని మహిళ తరఫు న్యాయవాది తెలిపారు. ఇది తల్లుల కోసం తయారు చేయబడిందని చెప్పారు. గర్భం దాల్చి 7 నెలలకు పైగా అయిందని ధర్మాసనం పేర్కొంది. పిల్లల మనుగడ హక్కు పరిస్థితి ఏంటి..? దీనిని మీరు ఎలా పరిష్కరిస్తారు..? అని బెంజ్ ప్రశ్నించింది. పిండం కడుపులో ఉందని, బిడ్డ ప్రసవించే వరకు అది తల్లి హక్కు అని న్యాయవాది ధర్మాసనానికి చెప్పారు. "ఈ దశలో పిటిషనర్ తీవ్రమైన బాధాకరమైన పరిస్థితుల్లో ఉన్నారని, ఆమె బయటకు కూడా రాలేదు, ఆమె నీట్ పరీక్ష కోసం క్లాసెస్‌కి వెళ్తుందని, ఆమె చాలా బాధాకరమైన స్థితిలో ఉన్నారు. ఆమె ఈ దశలో సమాజాన్ని ఎదుర్కోలేకపోతోంది" అని న్యాయవాది చెప్పారు. ఆమె మానసిక, శారీరక శ్రేయస్సును పరిగణలోకి తీసుకోవాలని న్యాయవాది వాదించారు. ఏప్రిల్ 25న పిండం, పిటిషనర్ పరిస్థితిని నిర్ధారించడానికి మెడికల్ బోర్డును ఏర్పాటు చేయాలని ఎయిమ్స్‌ని ఆదేశించామని, మే 3న తన ఉత్తర్వుల్లో హైకోర్టు పేర్కొంది. మెడికల్ బోర్డు నివేదిక ప్రకారం.. పిండంలో పట్టుకతో వచ్చే అసహజత ఏం లేదని, గర్భాన్ని కొనసాగించడం వల్ల తల్లికి ఎలాంటి ప్రమాదం లేదని హైకోర్టు పేర్కొంది. కాబట్టి భ్రూణ హత్య నైతికంగా, చట్టపరంగా అనుమతించబడదు అని చెప్పింది. పిటిషనర్ హైకోర్టు ముందు తన కడుపులో అసౌకర్యంగా అనిపించిందని ఏప్రిల్ 16న పేర్కొంది. అల్ట్రాసౌండ్ స్కాన్ చేయగా, ఆమె 27 వారాల గర్భవతి అని తేలింది. ఇది చట్టబద్ధంగా అను మతించే 24 వారాల పరిమితిని దాటిపోయింది. MTP చట్టం ప్రకారం, వైద్య బోర్డు ద్వారా పిండం అసాధారణంగా ఉండటం లేదా తల్లికి ప్రమాదం పొంచి ఉన్నప్పుడు మాత్రమే 24 వారాల కన్నా ఎక్కువ వ్యవధి గర్భాన్ని రద్దు చేయడానికి అనుమతించబడుతుంది.



# 'డబుల్ ఇస్మార్ట్ దిమాకికిరికిరి' టీజర్ విడుదల

ఉస్తాద్ రామ్ పోతినేని, సెన్సేషనల్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ తమ మ్యాసీవ్ బ్లాక్ బస్టర్ ఇస్మార్ట్ శంకర్‌కి సీక్వెల్‌తో అలరించ బోతున్నారు. టైటిల్ సూచించినట్లుగా 'డబుల్ ఇస్మార్ట్' చిత్రం ప్రీక్వెల్‌కు రెట్టింపు మ్యాడ్ నెస్ గా ఉండబోతోంది. డైనమిక్ స్టార్ రామ్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ, మేకర్స్ 'డబుల్ ఇస్మార్ట్' దిమాకికిరికిరి టీజర్ విడుదల చేశారు. హైదరాబాద్‌లోని ఒక ల్యాబ్‌లో ఉన్న హీరో పాత్రను తన చుట్టూ ఉన్న కొంతమంది శాస్త్రవేత్తలతో వివరించే వాయిస్ఓవర్‌తో టీజర్ ప్రారంభమైంది. రామ్ ఉస్తాద్ ఇస్మార్ట్ శంకర్ అలియాస్ డబుల్ ఇస్మార్ట్‌గా అదరగొట్టారు. అతను కిరాక్ అమ్మాయిలతో ఫ్లర్ట్ చేస్తాడు, ఖతర్నాక్ బీట్ కోసం అడుగులు వేస్తాడు. కావ్యా థాపర్ కథానాయికగా పరిచయమైంది. సంజయ్ దత్ బిగ్ బుల్ గా పవర్ ఫుల్ ఎంట్రీ ఇచ్చాడు.

క్లైమాక్స్ అద్భుతంగా వుంది. ఇస్మార్ట్ శంకర్ మాదిరిగానే, డబుల్ ఇస్మార్ట్ కూడా స్పిర్చువల్ టచ్ కూడిన మ్యాసీవ్, యాక్షన్-ప్యాక్ట్ క్లైమాక్స్ సీక్వెన్స్ లు ఉండబోతున్నాయి. అద్భుత శివలింగం, క్లైమాక్స్ ఫైట్ జరిగే భారీ జనసమూహం గూస్‌బంప్‌లను తెప్పించింది. టీజర్ ఖచ్చితంగా డబుల్ ఇంపాక్ట్‌తో ఇస్మార్ట్ మ్యాడ్ నెస్ ని రగిల్చింది. ప్రేక్షకులకు డబుల్ డోస్ యాక్షన్, ఎంటర్‌టైన్‌మెంట్, మాస్ ఉల్లాసాన్ని ఆస్వాదించారు. పూరి జగన్నాథ్ మరోసారి తన హీరోని బెస్ట్ స్టైలిష్, మాస్ , యాక్షన్-ప్యాక్ట్ అవతార్‌లో ప్రజెంట్ చేశారు. యూనిక్ హైదరాబాదీ యాసలోని వన్-లైనర్లు ఆద్యంతం అలరించాయి.

అతని టేకింగ్ చాలా స్టైలిష్‌గా ఉంది. కంటెంట్ డబుల్ యాక్షన్, డబుల్ ఎనర్జీ ,డబుల్ ఫన్‌తో టైటిల్‌కు అనుగుణంగా వుంది. రామ్ డబుల్ ఇస్మార్ట్‌ని రెట్టింపు నైపుణ్యంతో అద్భుతంగా పెర్ఫార్మ్ చేశారు.

అతని ఎనర్జిటిక్ యాక్టింగ్, ఆన్ స్క్రీన్ చరిష్మా ఎక్స్‌ట్రార్డినరీ గా వుంది.




# థియేటర్లకు 'తాళం'

రాష్ట్రంలో సినిమా థియేటర్లకు తాళాలు వేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో సార్వత్రిక ఎన్నికలతో పాటుగా ఓవైపు ఐపీఎల్ సాగుతుండటం, వచ్చేనెల 2 నుంచి మినీ వరల్డ్‌కప్ మొదలుకానుండటంతో సినిమాలకు వెళ్లే ప్రేక్షకులు కరువయ్యారు. దీంతో చాలా సినిమా థియేటర్లు ఖాళీగా ఉన్నాయి. దీంతో తెలుగు ప్రేక్షకులకు తెలంగాణ థియేటర్స్ అసోసియేషన్ ఊహించని షాక్ ఇచ్చింది. రాష్ట్రంలో పది రోజుల పాటు థియేటర్లను మూసేస్తున్నట్లు అత్యవసర ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో అక్యుపెన్సీ తక్కువ ఉండటం, నిర్వహణ ఖర్చులు పెరుగడంతో సింగిల్ స్క్రీన్ థియేటర్ల యాజమాన్యాలు తాత్కాలిక విరామం ప్రకటించాయి. శుక్రవారం నుంచి వచ్చే పది రోజులు సింగిల్ స్క్రీన్ థియేటర్లలో ఎలాంటి షోలు వేయవద్దని థియేటర్స్ అసోషియేషన్ నిర్ణయం తీసుకున్నది. ఎన్నికలతో పాటుగా ఐపీఎల్ ప్రభావంతో పెద్ద సినిమాలు విడుదల కావడం లేదు. చిన్న చిన్న సినిమాలు వచ్చినా.. వాటిని ప్రేక్షకులు ఆదరించడం లేదు. దీంతో సినిమా హాళ్లలో నిజంగానే ఈగలు కొట్టుకునే పరిస్థితులు దాపురించాయి. కొంత పెద్ద నగరాలతో పోలిస్తే.. ఇది చిన్న పట్టణాలు, మండలాల్లో మరింత ప్రభావం చూపించాయి. ఫలితంగా పది రోజులు థియేటర్లకు తాళాలు వేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఎల్లుండి నుంచి రాష్ట్రంలో సింగిల్ స్క్రీన్ థియేటర్లలో సినిమాలు ఆడవు.

# "బడ్డీ" ఫస్ట్ లిరికల్

అల్లు శిరీష్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ "బడ్డీ". గాయత్రి భరద్వాజ్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని స్టూడియో గ్రీన్ ఫిలింస్ బ్యానర్ పై కేఈ జ్ఞానవేల్ రాజా, అధన జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. శామ్ ఆంటోన్ దర్శకత్వం వహిస్తున్నారు. నేహ జ్ఞానవేల్ రాజా కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. యూత్ ఫుల్ లవ్ ఎంటర్ టైనర్ గా ఈ సినిమా తెరకెక్కుతోంది. "బడ్డీ" సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'ఆ పిల్ల కనులే..' రిలీజ్ చేశారు. హిప్ హాప్ తమిళ ఈ పాటను బ్యూటిఫుల్ గా కంపోజ్ చేశారు. సాయి హేమంత్ లిరిక్స్ అందించగా హిప్ హాప్ తమిళ తో కలిసి సంజిత్ హెగ్డే, ఐరా, విష్ణు ప్రియ రవి పాడారు. 'ఆ పిల్ల కనులే,



చూశాక తననే ఊహల్లో ఎగిరే మైకంలో మునిగే , మైకంలో తేలే, మబ్బులు తాకే, ఇద్దరి కథ ఇక మొదలాయే, నింగి నేల కలిశాయో, ఊసులేవో పలికాయో..' అంటూ మంచి రొమాంటిక్ నెంబర్ గా సాగుతుందీ పాట. చిత్రీకరణ పూర్తి చేసుకున్న "బడ్డీ" సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. రిలీజ్ డేట్ ను త్వరలో అనౌన్స్ చేయబోతున్నారు.



# కన్నడ బ్యూటీ 'ఆకాంక్ష'

కన్నడ బ్యూటీ ఆకాంక్ష శర్మ ఈ ముద్దగుమ్మ గురించి తెలియని వారుండరు. ఈ అమ్మడు త్రివిక్రమ్ అనే సినిమాతో సౌత్ సినీ ఇండస్ట్రీలో అడుగు పెట్టింది. పలు కంపెనీలకు బ్రాండ్ అంబాసిడర్‌గా నటించిన ఆకాంక్ష హీరోయిన్‌గా ఇప్పుడిప్పుడే అవకాశాలు దక్కించుకుంటూ ఉంది. క్యాడ్‌బరీ, సంతూర్‌తో పాటు పలు కంపెనీల యాడ్‌లో నటించిన ఈమె మహేష్ బాబు, కార్తీ, వరుణ్ దావన్ వంటి స్టార్స్‌తో కలిసి కమర్షియల్స్‌లో కనిపించింది. మోడల్‌గా సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న ఈమె ఈ మధ్య కాలంలో సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టి వరుసగా ఆఫర్లు దక్కించుకుంటుంది. సోషల్ మీడియాలో దాదాపుగా మిలియన్ మంది ఫాలోవర్స్ ను కలిగి ఉన్న ఈ అమ్మడు రెగ్యులర్ గా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూ ఆకట్టుకుంటూ ఉంది. తాజాగా మరోసారి ఈ అమ్మడి యొక్క అందాల ఆరబోత ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ రేంజ్ లో అందాల ఆరబోత చేస్తున్న ఆకాంక్ష శర్మ కు ముందు ముందు సౌత్ స్టార్స్ నుంచే కాకుండా బాలీవుడ్ స్టార్స్ నుంచి కూడా పిలుపు రావడం ఖాయం. హీరోయిన్ గా ఓ రేంజ్ లో బిజీ అవ్వడం ఖాయం అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. బ్లాక్ డ్రెస్‌లో అందాల ఆకాంక్ష క్లీ వేజ్ షో చేస్తే నెట్టింట షేర్ చేసిన ఈ పోటోలను ప్రేక్షకులు తెగ లైక్ చేస్తున్నారు.



# పింక్ బ్యూటీ

వాల్తేరు వీరయ్య చిత్రంలో ఐటెం సాంగ్‌తో పాటు పలు సినిమాల్లో ఐటం సాంగ్స్ చేయడం ద్వారా సౌత్ ప్రేక్షకులకు సుపరిచితం అయిన బాలీవుడ్ ముద్దుగుమ్మ ఊర్వశి రౌతేలా. ఈ అమ్మడు మోడల్ గా కెరీర్ ను ఆరంభించి ఎన్నో సినిమాల్లో, కమర్షియల్స్ యాడ్స్‌లో నటించి మెప్పించింది. మిస్ దివా యూనివర్స్ 2015 టైటిల్ ను గెలుచుకున్న నేపథ్యంలో మంచి పాపులారిటీని సొంతం చేసుకుంది. మిస్ యూనివర్స్ 2015 లో ఛాన్స్ సొంతం చేసుకోలేక పోయింది. అయితే సింగ్ సాబ్ ది గ్రేట్ సినిమాతో ఇండస్ట్రీలో అడుగు పెట్టింది. ఆ తర్వాత పలు సినిమాల్లో నటించి మెప్పించింది. అందాల ఆరబోత విషయంలో ఏమాత్రం తగ్గకుండా పాన్ ఇండియా రేంజ్ లో గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మ ఊర్వశి రౌతేలా మరోసారి నెట్టింట షేర్ చేసిన అందాల ఫోటో షూట్ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. పింక్ డ్రెస్ లో విభిన్నమైన లుక్ తో చూపరులను కట్టిపడేస్తుంది. సాధారణంగా పింక్ లో ముద్దుగుమ్మలు మరింత అందంగా కనిపిస్తారు అంటారు. ఈ ఫోటోలను చూస్తూ ఉంటే నిజమే అనిపిస్తుందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

# అహం ట్రైలర్‌కు అనూహ్య స్పందన

అహం
ట్రైలర్‌కు అనూహ్య స్పందన

ఏటర్నిటీ ఎంటర్టైన్మెంట్ బ్యానర్, మహేష్ దత్తా, లక్ష్మి నవ్య నిర్మాతలుగా వస్తున్న విద్య వాసుల అహం మే 17న ఆహాలో రిలీజ్ కాబోతుంది. ఈ సినిమాకి మనికాంత్ గెల్లి దర్శకత్వం వహించారు. రాహుల్ విజయ్, శివాని వీరిద్దరూ విద్య వాసులుగా ఏ మాత్రం వారి అహాన్ని తగ్గించుకోకుండా ఎలా పెళ్ళైన కొత్త కాపురాన్ని లీడ్ చేస్తున్నారు, చివరికి ఆ ఈగోస్ నుండి ఎలా బయటకి వచ్చారు అనే కథతో, ఇంటరెస్టింగ్ టైటిల్ తో "విద్య వాసుల అహం" వివాహం అని క్రియేటివ్ గా వచ్చేలా టైటిల్ డిజైన్ చేశారు, కాప్షన్ కూడా లాంగ్ లాంగ్ ఈగో స్టోరీ అని కథలో క్యారక్టర్లకి తగట్టుగా పెట్టి మన ముందుకు వచ్చి, ట్రైలర్ విడుదల చేశారు, అనూహ్యమైన స్పందన లభించింది. రాహుల్, శివాని పెర్ఫ్మాన్స్ అని అందరూ మెచ్చుకుంటున్నారు, సమ్మర్ లో మంచి రిలాక్సేషన్ ఇచ్చే సినిమాలా ఉంది అని, హాట్ సమ్మర్ లో కూల్ హిట్ అని నేటీజనులు కామెంట్స్ చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పాత్రికేయ సమహవేశంలో డైరెక్టర్ మనికాంత్ గెల్లి మాట్లాడుతూ: కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్. వెంకీ స్క్రిప్ట్ రాయడం వలెనే నేను సినిమా చెయ్యగలిగాను, అందరికన్నా ఎక్కువ సపోర్ట్ నాకు కళ్యాణీ మాలిక్ గారు ఇచ్చారు, అయనే హీరోయిన్ ని సజెస్ట్ చేశారు, విష్ణు మూర్తి రోల్ కి అవసరాల శ్రీనివాస్ ని కూడా ఆయనే సజెస్ట్ చేశారు. ఈ సినిమాకి సోల్ మొత్తం మ్యూజిక్, కళ్యాణీ మాలిక్ గారు 4 పాటలని నాలుగు విధాలుగా కంపోస్ చేశారు. స్పెషల్లీ పెళ్లి తరవాత పాట నాకు చాలా ఇష్టం. నా డైరెక్షన్ డిపార్టుమెంటుకి థాంక్స్ అండి, నాదేముంది షూట్ చేసి వెళ్ళిపోతాను, మిగతా అన్ని వర్క్స్ వాళ్ళే చూసుకుంటారు. ఈ మే 17 న మీరు థియేటర్స్‌కి వెళ్ళాలిసిన అవసరం లేదు అండి, ఎటువంటి అహం లేకుండా మేమే మీ ఇంటికి వస్తున్నాం, ఆహా లో తప్పకుండా చూడండి.



# దక్షిణ ట్రైలర్ టెర్రిఫిక్‌గా ఉంది : డైరెక్టర్ బుచ్చి బాబు



మంత్ర, మంగళ సినిమాలతో తెలుగు చలన చిత్ర రంగం లొ లేడీ ఓరియెంటెడ్ మూవీస్ కి ఒక ట్రెండ్ క్రియేట్ చేసిన డైరెక్టర్ ఓషో తులసిరామ్ మళ్ళీ "దక్షిణ " మూవీ తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు . కల్ట్ కాన్సెప్ట్ మూవీ బ్యానర్ నిర్మాణం లొ అశోక్ షిండే నిర్మాత గా కబాలి ఫేమ్ సాయి ధన్షిక కథనాయాకి గా మహాభారత్ మర్డర్స్ ఫేమ్ రిషవ్ బసు మరొక ముఖ్య పాత్రలో నటించారు.

ఇటీవల విడుదల చేసిన ఈ చిత్ర గ్లిమ్స్‌కు విశేష స్పందన లభించింది, లేటెస్ట్ గా ఈ మూవీ ట్రైలర్ ను ప్రముఖ దర్శకులు బుచ్చిబాబు విడుదల చేసారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ బుచ్చిబాబు మాట్లాడుతూ... ఈ మధ్య కాలం లొ నన్ను బయపెట్టిన ట్రైలర్ ఇదే అని మళ్ళీ తులసి రామ్‌గారు టాలీవుడ్‌కి మరో ట్రెండ్ సెట్టర్ సైకో థ్రిల్లర్‌ని దక్షిణ సినిమాతో ఇవ్వబోతున్నారు అంటూ అభినందించారు.

ఈ కార్యక్రమంలో దర్శక నిర్మాతలతో పాటు చిత్ర బృందం పాల్గొన్నది. దక్షిణ సినిమా సీట్ ఎడ్జ్ థ్రిల్లర్‌గా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది, నెక్స్ట్ ఏం జరుగుతుంది అనే సస్పెన్స్ ప్రేక్షకుల్లో ఉత్కంఠ రేపుతోందని త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని చిత్ర నిర్మాత అశోక్ షిండే తెలిపారు.

**Printed and Published M. DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, HNO:6-2-4/1,Shivaram pally ,Rajendranager, Ranga Reddy Dist, Telangana State -500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally, NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.VANITHA REDDY. "RNI. Title- Code: TEL TEL 12232**. Cell: 89779 39135.